క్లుప్తంగా

పర్యావరణంపై అవగాహన



ఇందల్వాయి: మండలంలోని చంద్రాయన్‌పల్లి, సిర్నాపల్లి గ్రామాల్లో గురువారం అటవీశాఖ సిబ్బంది 'అడవికి నిప్పు–పర్యావరణానికి ముప్పు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ భట్ మాట్లాడుతూ.. ప్రజలు అడవుల్లో నిప్పు పెట్టవద్దన్నారు. అడవులను ధ్వంసం చేస్తూ వన్యప్రాణులను వేటాడే వారి సమాచారాన్ని తమకు అందించాలని తెలిపారు. అధికారులు శ్రీనివాస్, ఆనంద్ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని వినతి



నిజామాబాద్‌నాగారం: నగరంలో అక్రమంగా వెలుస్తున్న వెంచర్లపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మకరందుకు కాంగ్రెస్ నాయకులు సయ్యద్‌ఖైసర్ గురువారం విన్నవించారు. అలాగే మైనారిటీల ప్రాంతాల్లో పార్కులు, మైదానాలు, లైబ్రరీలు ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ బడ్జెట్‌లో క్రీడలకు నిధులు కేటాయించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో గురువారం ఎస్సీ,ఎస్టీ,బీసీ వేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకం భూషణ్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ఆప్కారి రాజన్న, ఉషమ్ జైరాం, జిల్లా ఉపాధ్యక్షులుగా కారంపురి రవికుమార్, రాథోడ్ సుందర్‌సింగ్, గొల్లపల్లి జగన్ గౌడ్, వడ్లూరి శైలజ, రజక సంగం సాయిలు, జిల్లా అధికార ప్రతినిధిగా బాలేకార్ మనీష్ తేజ, కార్యదర్శులుగా అనిల్ కుమార్, చింతకింది సంతోష్, కుంచెపు ఆనంద్, సరిచంద్ మేఘవత్, చిన్నజీ ఎన్నికయ్యారు. వారికి రాష్ట్ర అధ్యక్షుడు బుస్సాపూర్ శంకర్ నియామక పత్రాలు అందజేశారు.

ఏబీవీపీ దిష్టిబొమ్మ దహనం



నిజామాబాద్‌అర్బన్: నగరంలో గురువారం ఏబీవీపీ నాయకుల దిష్టిబొమ్మను ఎస్ఎఫ్ఐ నాయకులు దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ వీసీని తొలగించాలని, ఎస్ఎఫ్ఐ నాయకుడిపై ఏబీవీపీ నాయకుల దాడిని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. నగర కార్యదర్శి మహేష్, వేణు, గణేష్, సందీప్, మారుతి, ఆజాద్, కిరణ్, సాయి ,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగర డిమాండ్ చేశారు. నగరంలో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై పార్లమెంటులో బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్లు ఊడ్చి కార్మికులకు సంఘీభావం తెలిపారు. నాయకులు పొట్ట పెంజర రమేష్, పాలమడుగు శ్రీనివాస్, తుకారాం , సల్లూరి శ్రీనివాస్, మాదారపు రాములు, మోతె పద్మ, మహేశ్వర్, బచ్చపల్లి దేవయ్య, గంగాధర్, సాయిలు, రమేష్, సాయిబాబా పాల్గొన్నారు.

మోపాల్ పీఎస్ తనిఖీ

మోపాల్: మండలకేంద్రంలోని మోపాల్ పీఎస్‌ను నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ ఆవరణను పరిశీలించి, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారికి తగు సూచనలు చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా సమాచార సేకరణ చేసుకుని ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై గంగాధర్, ఏఎస్సై రమేష్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

నగరం నిద్రపోతున్న వేళ..

నగరంలో అర్ధరాత్రి అక్రమ దందాలకు నియంత్రణ లేకుండా పోయింది. మహారాష్ట్ర, ఆదిలాబాద్ నుంచి ఇక్కడికి గంజాయి ఎక్కువగా తరలిస్తున్నారనేది బహిరంగ రహస్యంగా మారింది.

బార్‌లు, హోటళ్లు తెరిచి ఉంటున్నా పట్టించుకునే వారు లేరు. రోడ్లపై అల్లరి మూకలు ర్యాష్ డ్రైవింగ్‌తో సృష్టిస్తున్న న్యూసెన్స్ అంతాఇంతా కాదు.

- అర్ధరాత్రి వరకు తెరిచిఉంటున్న హోటళ్లు, బార్‌లు
- చీకట్లో మొరం, ఇసుక, పీడీఎస్ బియ్యం దందా
- అల్లరిమూకల ఘర్షణలు, కత్తులతో దాడులు
- పోలీసుల పెట్రోలింగ్ నామమాత్రమే



గంజాయి దందా..

నగరంలో ప్రధానంగా అర్ధరాత్రి గంజాయి, పీడీఎస్ బియ్యం, ఇసుక, మొరం అక్రమ రవాణా ఎక్కువగా కొనసాగుతోంది. మహారాష్ట్ర, ఆదిలాబాద్ నుంచి ఇక్కడికి గంజాయి ఎక్కువగా తరలిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అక్రమంగా తరలించిన పీడీఎస్ బియ్యాన్ని స్థానికంగా రైస్‌మిల్లులు, మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

ఖలీల్‌వాడి: నగరం నిద్రపోతున్న వేళ అక్రమ దందాలకు తెర లేపుతున్నారు. ఏ రోడ్డుకు వెళ్లినా అర్ధరాత్రి దుకాణాలు తెరిచి ఉంటున్నాయి. అక్రమార్కులూ తమ దందాలను సాఫీగా పూర్తి చేసుకుంటున్నారు. రాత్రి పెట్రోలింగ్ సమయంలో పోలీసులు వారి కంట కనబడిన కొన్నింటిపై కేసులు నమోదు చేస్తున్నారు. మరికొన్నింటిని సెటిల్‌మెంట్లు చేసి వదిలేసిన ఘటనలు ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు కొన్ని ప్రాంతాల్లో బహిరంగంగా హోటళ్లు నడుస్తుంటే పోలీసులు నోటీసులు ఇచ్చిన దాఖలాలు లేవు. రెండ్రోజుల క్రితం సీపీ కల్మేశ్వర్ అర్ధరాత్రి లాఠీ పట్టి రోడ్లపై తిరుగుతున్న వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. రిజిస్ట్రేషన్ పేపర్లు, నంబర్ ప్లేట్ లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. హోటళ్లు అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచడం గమనించి నోటీసులు జారీ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు

నగరంలోని శివాజీనగర్ చౌరస్తా, ఆర్యనగర్, ఆర్సపల్లి, తదితర ప్రాంతాలలో ఉన్న బార్‌లలో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకున్న దఖాలాలు లేవు. సారంగపూర్ ప్రాంతంలో ఓ హోటల్ వెనుక ఉన్న గోదాంలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మద్యం అమ్ముతున్నట్లు సమాచారం. నగరంలోని పలు ప్రాంతాల్లో టీస్టాల్స్, బిర్యానీ పాయింట్స్, పాన్‌షాపులు తెరిచి ఉంచినా పోలీసులు పట్టించుకోవడం లేదని అంటున్నారు.

ర్యాష్ డ్రైవింగ్..

అర్ధరాత్రి వరకు అల్లరి మూకలు రోడ్లపై తిరుగుతునే ఉంటారు. ఎక్కువగా బస్టాండ్, రైల్వే స్టేషన్, నెహ్రూపార్క్ ఏరియాలో బైక్‌లపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ కనిపిస్తారు. మద్యం మత్తులో వాహనాలను నడిపిస్తూ సామాన్యులతో ఘర్షణలు పడుతున్నారు. దాడులకు పాల్పడిన సందర్భాలూ ఉన్నాయి. అంతేగాకుండా గ్యాంగ్‌ల మధ్య విభేదాలతో పరస్పర దాడులు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. డిసెంబర్ 31న వంద ఫీట్ల రోడ్డు, కోటగల్లీలో ఓ గ్యాంగుపై మరో గ్యాంగ్ దాడులు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేశారు.

'నిజామాబాద్‌లో మళ్లీ గెలిచేది బీజేపీనే'



సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. నగరంలోని దుబ్బలో గురువారం కొమురమ్ భీమ్ క్లస్టర్ విజయసంకల్ప బస్సుయాత్ర, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ హాజరై, మాట్లాడారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు ఉంటాయని కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీకి 370 సీట్లు ఖాయమని మూడోసారి మోదీ సర్కారు వస్తుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులచారి దినేష్, జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి వెంకటరమణ, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, పోతంకర్ లక్ష్మీనారాయణ, పంచరెడ్డి లింగం, స్రవంతిరెడ్డి పాల్గొన్నారు.

సమాచారం..

నేడు బోర్గాం(పి)లో వైద్య శిబిరం

మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) పల్లె దవాఖానలో శుక్రవారం కంటి వెలుగులో భాగంగా మోతిబిందు సమస్య గుర్తించిన వారి కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో మోతిబిందు సమస్య ఉన్న వారిని పరీక్షించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పాలనలోనే గిరిజనుల అభివృద్ధి



సిరికొండలో మాట్లాడుతున్న భూపతిరెడ్డి

సిరికొండ: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే గిరిజనులు అభివృద్ధి చెందారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బంజారా భవనంలో గురువారం సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై భోగ్‌బండార్ పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సబ్‌ప్లాన్ తీసుకొచ్చిందన్నారు. అనంతరం వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పేదలకు పంపిణీ చేయాల్సిన ఇళ్ల స్థలాలను ఆయన పరిశీలించారు. మహిళా సమాఖ్య కార్యాలయంలో కార్యవర్గంతో వివిధ అంశాలపై చర్చించారు. ఆర్డీవో రాజేంద్రకుమార్, డీటీడీవో నాగరావు, ఏబీఎస్ఎస్ నాయకులు శివాజీ, చందర్, బాలరాజు, లస్కర్, చంద్రునాయక్, తారాచంద్, రవి, భాస్కర్ రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

ధర్పల్లి మండలంలో..

ధర్పల్లి: మండల కేంద్రంలో రామారావు మహారాజ్ విగ్రహ మూడో వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలను నిర్వహించారు. గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి మండలంలో..

ఇందల్వాయి: తిర్మన్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో అదనపు వసతులతో పాటు రూ.63లక్షలతో నిర్మించనున్న ప్రహరీ పనులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, ప్రిన్సిపల్ శ్రీలత, ఎంపీపీ రమేష్ నాయక్, ఎంపీటీసీ చింతల దాసు, మొప్పు గంగారెడ్డి, ఇమ్మడి గోపి, వెంకట్ రెడ్డి, సంతోష్ రెడ్డి, దన్లరాజు,చింతల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



జక్రాన్‌పల్లి: మండలంలోని కొలిప్యాక్‌లోగల ఆనందగిరి లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజరోహణం నిర్వహించారు. వేదపండితుడు దండాల మోహన్ శర్మ సమక్షంలో పూజలు నిర్వహించారు. ఆలయ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఫీజు కట్టలేదని విద్యార్థులకు పనిష్మెంట్

నిజామాబాద్‌అర్బన్: గూపన్‌పల్లి చౌరస్తాలోగల ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు ఫీజు కట్టలేదని గురువారం స్కూల్ యాజమాన్యం పనిష్మెంట్ ఇచ్చినట్లు తెలిసింది. ఫీజు కట్టలేని విద్యార్థులను ఓ ప్రత్యేక గదిలో ఉంచి విద్య బోధన చేయకుండ చేశారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని తెలుసుకొని పాఠశాల యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. కొందరు తల్లిదండ్రులు డీఈవోకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

ఒకరికి రెండు రోజుల జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటవ టౌన్ పీఎస్ పరిధిలో అర్ధరాత్రి షాపు తెరిచి ఉంచిన గైక్వాడ్ సంతోష్‌కు స్పెషల్ జ్యుడీషియల్, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు గురువారం తెలిపారు. సంతోష్ నిర్ణీత సమయం కంటే ఎక్కువ సేపు బస్టాండ్ దగ్గరలోని తన దుకాణం తెరిచి ఉంచినందుకు సిటీ పోలీస్‌యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామన్నారు.

కాంపిటేటివ్ బుక్స్ అందుబాటులో ఉంచాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ క్యాంపస్ సెంట్రల్ లైబ్రరీలో కాంపిటేటివ్ బుక్స్ అందుబాటులో ఉంచాలని ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం డిమాండ్ చేశారు. ఈ మేరకు తెయూ రిజిస్ట్రార్ యాదగిరికి గురువారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్–1 నోటిఫికేషన్ విడుదల చేసినందున కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన కాంపిటేటివ్ పుస్తకాలను తెప్పించి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని కోరారు. నాయకులు బానోత్ సాగర్ నాయక్, రాజేందర్, మహేశ్ పాల్గొన్నారు.

సిరికొండ సొసైటీ చైర్మన్‌గా గంగాధర్



సిరికొండ సొసైటీ నూతన కార్యవర్గం

సిరికొండ: సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా కొండూర్ గ్రామానికి చెందిన చెల్లెం గంగాధర్, వైస్ చైర్మన్‌గా సాయిరి నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సొసైటీ కార్యాలయంలో డీసీవో శ్రీనివాస్‌రావు గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక నిర్వహించారు. పదమూడు మంది డైరెక్టర్లకు గాను పదకొండు మంది హాజరవ్వగా, ఆయా పదవులకు ఒక్కొక్కరి పేరు మాత్రమే డైరెక్టర్లు ప్రతిపాదించడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీసీవో ప్రకటించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లతో డీసీవో ప్రమాణ స్వీకారం చేయించారు. సీఈవో మహ్మద్ అలీ, డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, నర్సింహరెడ్డి, శ్రీలత, చిన్నారెడ్డి, గోవింద్, లింగం, రమేష్, గంగవ్వ, బాబన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

సిరికొండ పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను కైవసం చేసుకోవడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో సంబురాలు చేసుకున్నారు. కొత్తగా ఎన్నికైన చైర్మన్. వైస్ చైర్మన్‌లను సన్మానించారు. మండలాధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, నాయకులు మల్లేష్‌యాదవ్, కుందేళ్ల శ్రీనివాస్, ఆసిఫ్, భాస్కర్‌రెడ్డి, జగన్, శ్రీధర్, జాఫర్, నందిలాల్, బుచ్చన్న, వినోద్, లక్ష్మణ్, సంతోష్‌నాయక్, గంగారెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,300	వెండి (కిలో)	74,900
22 క్యారెట్స్	59,292	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	45	60
బెండకాయ	65	80	పచ్చిమిర్చి	40	70
జీరకాయ	60	80	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	45	65	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	60	80
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	60	80
పుదీనా	35	60	చిక్కుడుకాయ	35	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఈగల్ (తెలుగు) - 11.00, 4.40 భ్రమయుగం (తెలుగు) - 2.00, 7.40 సుందరం మాస్టర్ (తెలుగు) - 10.30
స్క్రీన్-2	సుందరం మాస్టర్ (తెలుగు) - 11.00, ఊరుపేరు భైరవ కోన (తెలుగు) - 1.30, 7.30, ఆర్టికల్-370 (హిందీ) - 4.30, 10.30
స్క్రీన్-3	సిద్ధార్థరాయ్ (తెలుగు) - 10.45, సుందరం మాస్టర్ (తెలుగు) - 1.50, 7.40, మస్తు షేడ్స్ ఉన్నయ్‌రా - 4.40, హనుమాన్ (తెలుగు) - 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆర్టికల్–370 (హిందీ) - 1.00, 7.10, 10.35, సుందరం మాస్టర్ (తెలుగు) - 4.25
స్క్రీన్-2	సిద్ధార్థరాయ్ (తెలుగు) - 1.30 ఊరి పేరు భైరవకోన (తెలుగు)-7.40
స్క్రీన్-3	క్రాక్ జీతేగా తో జీయేగా (హిందీ) - 10.05, 6.20, 9.40, తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి - 1.25
స్క్రీన్-4	ముఖ్యగమనిక (తెలుగు) - 1.05, మస్తు షేడ్స్ ఉన్నయ్‌రా 3.50, 10.10 హనుమాన్ (తెలుగు) - 6.50
దేవి	హనుమాన్ (తెలుగు)
నటరాజ్	క్రాక్ జీతేగా తో జీయేగా (హిందీ)
లలితామహల్	భ్రమయుగం (తెలుగు)
విజయ్	లాల్‌సలామ్(తెలుగు) 11.15, 6.15 యాత్ర-2 (తెలుగు) 2.15, 9.15

సంక్షిప్తం

ఘనంగా ఫేర్‌వెల్ పార్టీ



డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు సెకండియర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

అంతర్జాతీయ కవలల దినోత్సవం



సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో అంతర్జాతీయ కవలల దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న 16 కవలల విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అలాగే స్కౌట్స్ గైడ్స్ వ్యవస్థాపకులు రాబర్ట్ బడెన్‌పావెల్ జయంతిని పురస్కరించుకొని ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు విరాళం



సిరికొండ: మండలంలోని గడ్కోల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గురువారం ముదిరాజ్ సంఘ సభ్యులు రూ.5వేల విరాళం అందజేశారు. హెచ్ఎం రవిందర్, సంఘ ప్రతినిధులు జైరామ్, రాములు, నరేష్, టీచర్లు నరహరి, సంతోష్ ఉన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

సిరికొండ: ఆదర్శ పాఠశాలలో 6,7,8,9,10 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకొనే తేదీని వచ్చే నెల రెండు వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సకాలంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వైద్యుడు భూమారెడ్డి మృతికి సంతాపం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో గురువారం ఛాతీ వైద్య నిపుణులు భూమారెడ్డి సంతాప సభను ఐఎంఏ నిజామాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు దామోధర్‌రావు, కార్యదర్శులు కొట్టూరు శ్రీశైలం మాట్లాడుతూ.. భూమారెడ్డి కుమారుడు సాయి సామ్రాట్ తన తండ్రి స్థానంలో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఐఎంఏ ప్రతినిధులు రాజేష్, నీలి రాంచందర్, అజ్జ శ్రీనివాస్, శ్రీహరి, రామ్మోహన్‌రావ్, ముత్తన్న, సురేందర్, వినోద్ కుమార్‌గుప్తా, జీవన్‌రావు, సంధ్యారాణి, కవితరెడ్డి, సాంబశివరావు, విశాల్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



నిజామాబాద్ సిటీ/నిజామాబాద్ రూరల్: నగరంలోని వీక్లీ బజార్ ఎస్బీఐ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం పలువురు మహిళలకు కుట్టు మిషిన్లు, వృద్ధులకు చక్రాల కుర్చీలు, దారుగల్లి ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్‌ను హైదరాబాద్ జనరల్ మేనేజర్ మంజుశర్మ విరాళంగా అందజేశారు. అలాగే సారంగాపూర్ ఆర్ఏసీసీ నిజామాబాద్ కొత్త ప్రాంగణాన్ని ప్రారంభించారు. అధికారులు సూర్యకాంత దాష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ మంత్రికి సన్మానం



సుభాష్‌నగర్: హైదరాబాద్‌లో గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను టీఎన్‌జీవో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, సంఘ బాధ్యులు సతీష్ ఉన్నారు.

నేటి చిత్రం..



దుబ్బరోడ్డులో వృథాగా ఉన్న మరుగుదొడ్లు

మరుగుదొడ్లను బాగుచేయించరూ!

నగరంలోని వివిధ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. అలాగే వాటర్ ట్యాంకుల ద్వారా పైపులైన్‌లో నీరు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. కానీ వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో మరుగుదొడ్లు అధ్వానంగా మారి, వృథాగా ఉన్నాయి. అధికారులు స్పందించి మరుగుదొడ్లను బాగుచేయించి, వినియోగంలోకి తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్